అంతటా ఉత్కంఠ

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఓట్ల లెక్కింపు సమయం రానే వచ్చింది. 17 రోజుల నిరీక్షణకు మరికొన్ని గంటల్లో తెర పడనుంది. గెలుపుపై అభ్యర్థులతోపాటు ప్రజల్లో నెలకొన్న ఉత్కంఠ వీడనుంది. గెలుపు గుర్రంపై సవారీ చేసి సత్యవేడు ఎమ్మెల్యే పీఠం అధిష్ఠించనున్నది ఎవరో కొన్ని గంటల్లో తేలిపోనుంది. మే 13న ఈవీఎంల్లో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం మంగళవారం వెల్లడికానున్న నేపథ్యంలో సర్వత్రా టెన్షన్ నెలకొంది. ఓటరు తీర్పు ఎలా ఉంటుందోనని అందరూ ఎదురు చూస్తున్నారు.

- నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- నియోజకవర్గ వ్యాప్తంగా టెన్షన్ టెన్షన్
- డీలాపడిన టీడీపీ, ఇతర పార్టీలు
- వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ


తిరుపతిలోని ఓట్ల లెక్కింపు కేంద్రం

వరదయ్యపాళెం: సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టానికి సమయం ఆసన్నమైంది. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానుంది. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు జరగనుంది. సత్యవేడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా 15 మంది బరిలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున నూకతోటి రాజేష్, టీడీపీ అభ్యర్థిగా కోనేటి ఆదిమూలం, కాంగ్రెస్ అభ్యర్థి బాలగురవం బాబు, బీఎస్పీ అభ్యర్థి సుప్రియ, లిబరేషన్ కాంగ్రెస్ అభ్యర్థి విజయకుమార్, జయభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి వి.కిరణ్, స్వతంత్ర అభ్యర్థులుగా కిరణ్ కుమార్, కోగిల వెంకటాచలం, కోళ్ల విజయ్‌కుమార్, చెంగయ్య, రమేష్‌బాబు, రాఘవయ్య, జేడీ రాజశేఖర్, వి.వెంకటేష్, వెంపళ్ల కృష్ణారావు పోటీలో ఉన్నారు. వీరిలో ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. గత మే 13వ తేదీన నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోటీలో ఉన్న అభ్యర్థులు ఫలితం కోసం 17 రోజులు ఎదురు చూడాల్సిన ఉత్కంఠ పరిస్థితి నెలకొంది. విజయం ఎవరిదో కొన్ని గంటల్లో తేలనుంది. మొత్తం 20 రౌండ్లలో పూర్తిస్థాయి ఫలితం వస్తుందని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

ఫలితంపై ఉత్కంఠ

సత్యవేడు నియోజకవర్గంలో ఎన్నికల ఫలితంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నియోజకవర్గంలో ఎక్కడ చూసిన ఓట్ల లెక్కింపు ఫలితంపైనే చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా ప్రధాన పోటీ వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్య ఉంది. కాంగ్రెస్, బీఎస్పీ గెలుపుపై ఎటువంటి ఆశలు పెట్టుకోలేదు. స్వతంత్ర అభ్యర్థులు కూడా నామమాత్రంగానే పోటీలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ మినహాయించి మిగిలిన అభ్యర్థులకు డిపాజిట్లు రావడం కూడా కష్టమే. ప్రస్తుతం ప్రజలు ఈ ఫలితం కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

1,83,683 మంది ఓటు హక్కు వినియోగం

నియోజకవర్గంలో 2,15,385 మంది ఓటర్లు ఉన్నప్పటికీ వీరిలో 1,83,683 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 89,844, మహిళలు 93,839 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడం గమనార్హం. మొత్తం 85.28 శాతం భారీ పోలింగ్ నమోదైంది. ఈ భారీ పోలింగ్ ఎవరికి అనుకూలంగా ఉంటుందో మంగళవారం తేలనుంది.

అభ్యర్థుల్లో టెన్షన్

మంగళవారం ఎన్నికల ఫలితం వెలువడనుంది. మధ్యాహ్నం 2 గంటలలోగా ఫలితం బయటకు వచ్చే అవకాశం ఉంది. దీంతో పోటీ చేసిన అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. పోలింగ్ తర్వాత దాదాపుగా 17రోజులపాటు పోటీ చేసిన అభ్యర్థులు రిలాక్స్ అయ్యారు. అయితే కౌంటింగ్ ప్రక్రియ మొదలు కానుండడంతో మళ్లీ అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు. గెలుపుపై అభ్యర్థులు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా గెలుస్తామా? లేదా? అన్న టెన్షన్ కూడా ఉంది. ఈ నేపథ్యంలో విజయలక్ష్మి ఎవరిని వరిస్తుందో కొన్నిగంటలపాటు వేచి చూడాల్సి ఉంది.

గెలుపుపై వైఎస్సార్‌సీపీలో ధీమా

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ ఎన్నికలకు రెండు నెలల ముందే నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులయ్యారు. అప్పటి నుంచి నియోజకవర్గంలోని 7 మండలాల నాయకులను సమన్వయం చేసుకుని ఎన్నికల ప్రణాళికలు సిద్ధం చేసుకుని, పోలింగ్ వరకు ఎక్కడా వెనుకడుగు వేయకుండా అన్ని విషయాల్లో ముందు వరుసలో నిలిచారు. దీంతో 7 మండలాల్లోని అన్ని గ్రామాల్లో స్థానిక పార్టీ శ్రేణుల సహకారంతో ప్రచారం ముమ్మరంగా చేసి ప్రజలతో మమేకమవడంలో విజయం సాధించారు. రాజేష్ మొదటి నుంచి రాజకీయ కుటుంబంలో పెరగడం ఆయన దత్తత తల్లి గుమ్మడి కుతూహలమ్మ ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది వివిధ హోదాల్లో పదవులు పొందడం, ఆమె వెంట నడిచిన ఆయనకు రాజకీయ ఒడిదుడుకులు ఎలా ఎదుర్కోవాలో మంచి అనుభవం ఉంది. ఆ దిశగా అడుగులు వేసిన ఆయన రెండు నెలల వ్యవధిలోనే అటు పార్టీ శ్రేణులు, ఇటు ప్రజల మనస్సులు గెలుచుకున్నారు. దీనికి తోడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల సంక్షేమ పథకాలు నియోజకవర్గంలోని 85శాతం కుటుంబాలకు 2వేల కోట్లకు పైగా లబ్ధి చేకూరింది. వీరందరి ఆశీస్సులతో రాజేష్ గెలుపు దాదాపు ఖాయమనే చెప్పాలి.

టీడీపీ నేతలు డీలా

సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ నేతలు డీలా పడిపోయినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలోని 7 మండలాల్లో కూడా ఫ్యాన్ గాలి అధికంగా ఉండడంతో టీడీపీ నేతల ఓటమి తప్పదని భావిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కోనేటి ఆదిమూలం ఆఖరి నిమిషంలో ప్రతిపక్ష టీడీపీలో చేరడం, ఆయన్నే ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ప్రకటించింది. సిట్టింగ్ ఎమ్మెల్యేగా తమను అనేక ఇబ్బందులకు గురిచేయడం, కేసులు పెట్టి ముప్పు తిప్పలు పెట్టిన ఆయన వెంట మేము నడవలేమంటూ తెలుగు తమ్ముళ్లు తెగేసి చెప్పారు. అంతేకాక సిట్టింగ్ ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజల్లో వ్యతిరేకతను మూటగట్టుకున్న ఆయన గెలుపు కష్టమేనని అనేక సర్వేలు సైతం తేల్చేశాయి. ఈ నేపథ్యంలో టీడీపీ నుంచి ఆదిమూలం అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన తక్షణమే నియోజకవర్గంలో టీడీపీ నేతలు ఒక్కసారిగా అసమ్మతి గళం వినిపించారు. తక్షణమే ఆదిమూలంను ఎమ్మెల్యే అభ్యర్థిగా మార్పు చేయాలని బహిరంగంగా నిరసనకు దిగారు. అయితే అధినేత చంద్రబాబు మాత్రం ఆదిమూలం కొనసాగింపునకే మొగ్గు చూపారు. దీంతో గ్రామాలకు ప్రచారానికి వెళ్లిన సమయంలో పలుచోట్ల ఆదిమూలాన్ని అడ్డుకోవడం.. తమ ఊరికి రావద్దంటూ బహిరంగంగానే తెలుగు తమ్ముళ్లు నిరసన తెలిపారు. దీనికి తోడు స్వతంత్ర అభ్యర్థిగా దిగిన యాతాటి రమేష్‌బాబుకు పరోక్షంగా మెజారిటీ టీడీపీ నేతలు సహకరించారు. అంతేకాక ఆయన నుంచి పెద్ద మొత్తంలో తాయిలాలు అందుకున్నట్లు కూడా నియోజకవర్గంలో గత రెండు వారాలుగా చర్చ జరుగుతోంది. ఇన్ని అవాంతరాల మధ్య టీడీపీ అభ్యర్థి గెలవడం కష్ట సాధ్యమే.

తిమ్మిభూపాలపురం – దాసుకుప్పం

సత్యవేడు నియోజకవర్గంలో 279 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో మొదటి నంబర్ బూత్ బీఎన్‌కండ్రిగ మండలంలోని తిమ్మిభూపాలపురం కాగా చిట్టచివరి 279వ బూత్ సత్యవేడు మండలంలోని దాసుకుప్పం. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా తిమ్మిభూపాలపురం బూత్ నుంచి ప్రారంభమై దాసుకుప్పంలో ముగియనుంది.


నూకతోటి రాజేష్
వైఎస్సార్‌సీపీ


కోనేటి ఆదిమూలం
తెలుగుదేశం పార్టీ

రానుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే



రాష్ట్రంలో రానున్నది వైఎస్సార్‌సీపీ పాలన. ఇందులో ఎలాంటి సందేహం లేదు. గత ఐదేళ్లలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధతతో అమలు చేసి, ప్రజల మన్ననలు పొందారు. ముందుచూపు ఆలోచనతో ప్రజలు పేదరికం నుంచి ఆర్థికంగా వారిని అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో సంక్షేమ పథకాలను మహిళల పేరిట పంపిణీ చేసిన ఆయన రుణం తీర్చుకునేందుకు మహిళలు పెద్దఎత్తున ఓట్లు వేసి విజయానికి నాంది పలికారు. –బొర్రా మాధవి, కేవీబీపురం మండలం

జగన్‌కు తిరుగులేదు



సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తిరుగులేని మెజారిటీని సాధిస్తుంది. ఇందులో ఎలాంటి సందేహం అవసరం లేదు. విశ్వసనీయత కలిగిన సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీకే పట్టం కడతారని చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులందరూ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేసి రుణం తీర్చుకున్నారు. వారి మెజారిటీతో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యం.
–చిన్నా, మాజీ సర్పంచ్, వరదయ్యపాళెం

గెలుపుపై ధీమా ఉంది



రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకే ప్రజలు పట్టం కట్టారు. 130 స్థానాలు సాధించి వైఎస్సార్‌సీపీ విజయం కైవసం చేసుకుంటుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎంగా విశాఖలో ప్రమాణ స్వీకారం చేయడం తథ్యం. వైఎస్సార్‌సీపీ గెలుపును ఎవరూ ఆపలేరు. ఫలితాల వరకు ఉనికిని చాటుకునేందుకు ప్రతిపక్ష టీడీపీ వారు నానాయాగి చేస్తున్నారే తప్ప వేరొకటి లేదు.
–పరంధామరెడ్డి, వెంగారెడ్డికండ్రిగ, వరదయ్యపాళెం మండలం

క్లుప్తంగా

పల్లికొండేశ్వరస్వామికి ప్రదోష పూజలు నేడు



నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలో ఉన్న సర్వ మంగళ సమేత పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ప్రదోష పూజలు జరుగుతాయని ఆలయ ఈఓ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రదోష మండపంలో నందీశ్వరునికి, వాల్మీకేశ్వరస్వామివారికి, మరకదాంబిక అమ్మవారికి ఏక కాలంలో విశేష అలంకారాలు, అభిషేకాలు, మహాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రదోష పూజల్లో పాల్గొనదలచిన వారు రూ.500 చెల్లించి, రసీదు పొందాలని తెలిపారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న ఉభయకర్తలు

నాగలాపురం: మండల కేంద్రంలోని టీటీడీ అనుబంధ వేదవల్లి సమేత శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో సోమవారం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి నాగలాపురం బీసీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ వార్డు సభ్యుడు వి.ఉదయ్ కుమార్ ఉభయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారి ఉదయ్‌కుమార్, సుధ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం పడిగాపులు


బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

నాగలాపురం: వృద్ధులు పింఛన్ కోసం బ్యాంక్ వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. గత రెండు నెలలుగా తాము అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. గతంలో ఒకటో తేదీనే ఇంటి వద్దనే పింఛన్ అందుకునే వారమని, ప్రస్తుతం మూడో తేదీ వచ్చినా ఇంకా పింఛన్ అందలేదని, ఉదయం నుంచి బ్యాంక్ వద్ద వేచి ఉన్నామన్నారు. ఖర్చులకు కూడా డబ్బులు లేవని, వీటన్నింటికి కారణం చంద్రబాబు నాయుడేనని వారు ఆరోపించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేక వలంటీర్లపై ఈసీకి ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఎన్నికల కమిషన్ వలంటీర్ వ్యవస్థను పూర్తిగా నిలిపివేసిందని, చంద్రబాబు చేసిన బుద్ధి తక్కువ పనితో తాము రెండు నెలలుగా ఎంత అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

దివ్యాంగుల గుర్తింపు సర్వే


దివ్యాంగ చిన్నారితో జిల్లా అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: దివ్యాంగులను గుర్తించి, వారిని స్థానిక భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష విద్యా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి తెలిపారు. వారు సోమవారం బుచ్చినాయుడు కండ్రిగలోని భవిత కేంద్రాన్ని పరిశీలించి, నీర్పాకోట గ్రామంలో దివ్యాంగుల గుర్తింపు సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల తల్లిదండ్రులు తమ పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలని, ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దివ్యాంగులకు కూడా సకాలంగులవలే అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. వైకల్యం శరీరానికే గానీ మనస్సుకు కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, ఐఈఆర్‌టీఆర్ అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


డీఎస్పీ ఉమా మహేశ్వరరెడ్డి

శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అల్లర్లు సృష్టించకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఉమా మహేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని శ్రీకాళహస్తి డివిజన్‌లో 144సెక్షన్, 30యాక్ట్ అమలు చేస్తున్నామన్నారు. ఎవరైనా అల్లర్లు చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు తరువాత పల్లెలు, పట్టణాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు 120మంది పోలీసులతో కూడిన బృందాలు, కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు వివరించారు. విజయోత్సవర్యాలీలు, సభలకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు.

ప్రైవేటు పాఠశాలల ఆకస్మిక తనిఖీ



ప్రైవేటు పాఠశాలకు తాళాలు వేస్తున్న ఎంఈవో భువనేశ్వరి తదితరులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను సోమవారం ఎంఈవో భువనేశ్వరి ఆకస్మిక తనిఖీలు చేశారు. అందులో భాగంగా పట్టణంలోని కందన్ ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. ఆ పాఠశాలకు గుర్తింపు లేకపోవడంతో పాఠశాలను వెంటనే మూసివేయాలని ఆదేశించారు. అనుమతులు వచ్చిన తరువాత పాఠశాలను పునఃప్రారంభించాలన్నారు. అదే విధంగా పట్టణంలోని వివేకానంద పాఠశాలను కూడా తనిఖీ చేశారు. గతంలో వారిపై వచ్చిన ఫిర్యాదులపై పాఠశాల యజమాన్యాన్ని వివరణ కోరారు. మరోసారి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలను 12వ తేదీ తరువాతనే పునఃప్రారంభించాలని ఆదేశించారు. ముందుగా ప్రారంభిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు తీసుకునే ఫీజు వివరాలను నోటీసుబోర్డుపై ఉండాలని చెప్పారు. అధిక ఫీజులు వసూలు చేసినా, నోటీసు బోర్డులో పొందు పరచకపోయినా వీటిపై ఫిర్యాదులు వస్తే సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కార్యాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


ఆలత్తూరులో జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: డెంగీ, మలేరియా, చికెన్ గున్యా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. సోమవారం ఆయన ఆలత్తూరు గ్రామంలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా దోమకాటు ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర జ్వరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా జ్వరాలు ఎనాఫిలస్ అనే దోమ నుంచి వ్యాపిస్తాయని తెలిపారు. రోజు విడిచి రోజు జ్వరం రావడం, వణుకుతో కూడిన జ్వరం, తలనొప్పి, వంటి నొప్పులు, రక్తహీనత వంటివి వస్తాయన్నారు. ఈ జ్వరాలు సోకుండా ఉండటానికి దోమలు రాకుండా తెరలు, ఇంటి ద్వారాలకు కిటికీలకు, మెష్‌లు అమర్చుకోవాలని, ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. వైద్య సిబ్బంది ఈ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మ జాతర ప్రారంభం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పిచ్చాటూరు రోడ్డులో వెలసిన బంగారమ్మ ఆలయంలో మంగళవారం నుంచి జాతర ప్రారంభమైనట్లు ఈవో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 7వ తేదీ అంబళ్లు, 11న అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు, అలంకారాలు జరుగుతాయన్నారు. 7గంటలకు గెరిక పూజ, 10గంటలకు మైలు ముగ్గు, మధ్యాహ్నం 2గంటలకు పోతురాజు ముగ్గు, సాయంత్రం 4గంటలకు పొంగళ్లు జరుగుతాయన్నారు. 12న ఉదయం 6గంటలకు అభిషేకాలు సాయంత్రం 4గంటలకు కుంభం, రాత్రి 6 గంటలకు అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనం ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య


ఎండీ పుత్తూరులో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సర్పంచ్ మోహనప్రియ

ఏర్పేడు: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు సర్పంచ్ మోహనప్రియ తెలిపారు. మండలంలోని ఎండీపుత్తూరు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సోమవారం పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల నమోదులో భాగంగా ఇంటింటికీ వెళ్లారు. పాఠశాలలో చేర్చాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోట్, బ్యాగులు, టై, సాక్స్, షూ, బెల్టులు అందజేస్తున్నట్లు వివరించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ బోధన అందిస్తున్నట్లు చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మక విద్యా బోధన ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మమ్మ, ప్రధానోపాధ్యాయులు సునీత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి


కారణి గ్రామంలో విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యాహక్కు చట్ట ప్రకారం బడి ఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని, తప్పనిసరిగా పాఠశాలల్లోనే ఉండాలని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. వారు సోమవారం మండలంలోని వేణుగోపాలపురం, కారణి గ్రామాల్లోని బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లా డి పిల్లలను పాఠశాలకు పంపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటుగా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, బెల్ట్, నోట్ బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు, రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను బడికి పంపితే ప్రభుత్వం ప్రోత్సాహం కింద అమ్మ ఒడి పథకంలో తల్లికి రూ.14 వేలు ఇస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయలు రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పురుషోత్తం, జయచంద్రారెడ్డి, శ్రీనివాసులు, పద్మావతి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

త్వరితగతిన విద్యాసామగ్రి పంపిణీ


రికార్డులు, యూనిఫాం తదితరాలను పరిశీలిస్తున్న ఎంఈవో భువనేశ్వరి

శ్రీకాళహస్తి: రానున్న విద్యాసంవత్సరానికి విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోటు పుస్తకాలను త్వరితగతిన ఆయా పాఠశాలలకు పంపిణీ చేయాలని అధికారులను ఎంఈవో భువనేశ్వరి ఆదేశించారు. పట్టణంలోని జెడ్పీ బాలు ర పాఠశాలలో ఉన్న విద్యాసామగ్రిని ఆమె సోమ వారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలకు రావాల్సిన విద్యాకానుక పాఠ్యపుస్తకాలు 1 నుంచి 7వ తరగతి వరకు మండల కేంద్రాలకు చేరాయని 8, 9, 10వ తరగతులకు సంబంధించి వచ్చిన వెంటనే ఆయా పాఠశాలలకు జూన్ 12లోపు చేరుస్తామన్నారు. ప్రస్తుతం 10,360 జతల యూనిఫాం, 45,396 పాఠ్యపుస్తకాలు, 64,367 రాతపుస్తకాలు, 789 ప్రైమరీ డిక్షనరీలు తమ వద్దకు చేరుకున్నాయని వాటిని విద్యార్థులకు 12వ తేదీ లోపు అందజేస్తామన్నారు. ఈ సంవత్సరం అడ్మిషన్లు ఎక్కువగా జరిగే విధంగా ఉపాధ్యాయులతో కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలతో దివ్యాంగులకు భరోసా

తొట్టంబేడు : భవిత కేంద్రాలు దివ్యాంగులకు భరోసానిస్తాయని జిల్లా ఐఈఆర్టీ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలో ఐఈఆర్టీల సారథ్యంలో చిలకావారి కండ్రిగలో నిర్వహిస్తున్న దివ్యాంగుల గుర్తింపు సర్వేని సోమవారం ఆయన జిల్లా ప్లానింగ్ కో–ఆర్డినేటర్ రామచంద్రారెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముక్కంటి సేవలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి



శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం టీటీడీ ఈవో ధర్మారెడ్డి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద వేదపండితులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చిన్న పాండూరు పీహెచ్‌సీకి హీరో పరిశ్రమ చేయూత

వరదయ్యపాళెం: చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి శ్రీసిటీలోని హీరో మోటార్స్ పరిశ్రమ తోడ్పాటునిచ్చింది. ఆ దిశగా హీరో పరిశ్రమ కమ్యూనిటీ సోషియల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్) నిధులు రూ.14 లక్షలతో 190 మీటర్లు మేరకు నాడు–నేడు ద్వారా నూతనంగా నిర్మించిన ఆస్పత్రి భవనానికి ప్రహరీగేటును నిర్మించారు. సోమవారం ఆస్పత్రి వైద్య సిబ్బంది అనిత, లావణ్య, గణాంకాధికారి, సోమశేఖర్ సమక్షంలో హీరో పరిశ్రమ నిధులు ప్లాంట్ మ్యాని ఫ్యాక్చరింగ్ హెడ్ నిహాల్ కౌల్, ప్లాంట్ ఆర్ హెడ్ మనోహర చక్రవర్తి, ప్లాంట్ పీఈ హెడ్ అనుప్ గుప్త, చీఫ్ సెక్యూరిటీ కిరణ్, సివిల్ సెక్టార్ హెడ్ ఆశిష్ కుమార్, ప్లాంట్ పీఎంఓ డాక్టర్ హర్షవర్ధన్ చేతుల మీదుగా నూతన ప్రహరీ గోడను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్య సిబ్బంది హీరో పరిశ్రమ ప్రతినిధులకు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఇలాగే ఎప్పటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి హీరో పరిశ్రమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. అలాగే రాత్రి వేళలో ఆస్పత్రిలో సిబ్బంది భద్రత కోసం పరిశ్రమకు చెందిన సెక్యూరిటీ గార్డును ఆస్పత్రిలో నియమించి, తమకు భద్రత కల్పించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పరిశ్రమ ప్రతినిధులు, ఈ విసయం తమ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హీరో పరిశ్రమ ప్రతినిధులు, వైద్యులు


ప్రహరీగోడను ప్రారంభిస్తున్న హీరో పరిశ్రమ ప్రతినిధులు

పెంచలకోనలో వర్షం

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో సోమవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. గత కొంత కాలంగా ఎండవేడిమికి, ఉక్కపోతకు అల్లాడిన ప్రజలు వర్షం కురవడంతో కొంత ఉపశమనం పొందారు. మండలంలో పలు గ్రామాల్లో వర్షం కురిసింది ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు రావడంతో చల్ల గాలులు వీయడంతో పాటు చిరుజల్లులు పడడంతో వేసవి తాపం నుంచి ప్రజలు ఊరట పొందుతున్నారు. బ్రహ్మోత్సవాలకు ముందు, బ్రహ్మోత్సవాలు ముగిసిన అనంతరం పెంచలకోన క్షేత్రంలో వర్షం కురవడం ఆనవాయితీ అని భక్తుల నమ్మకం.

మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం

శ్రీకాళహస్తి: జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ తరగతులు ప్రారంభమైనట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.